# 20. అతనికంటె ఘనుడు

ఉత్తర భారతంలోని సుప్రసిద్ధ సంస్థానం పాటియాలా మహారాజా భూపేంద్రసింహజీవారు జీవితమంతా పెద్ద మధుపాత్రగా మలచుకున్న ధన్యజీవి.

శ్రీవారి రాజభవనాన్నానుకునే బ్రహ్మాండమైన యీత కొలను ఉండేది. దానిని ప్రాశ్చాత్య పద్ధతులలో శ్రీవారు తమ అభిరుచుల కనుగుణంగా స్వయంగా నిర్మింపజేసుకున్నారు. దాని చుట్టూ మనోహరమైన ఉద్యానవనం ఉండేది. ఆ కొలనూ, పరిసరోద్యానమూ సదా సుగంధాలు వెదజల్లుతూ మరోలోకాన్ని తలపింపజేస్తూండేవి.

అక్కడ మహారాజావారిచ్చే విందులు అపురూపమైనవి. ఆ విందులకు ఒక్కసారి వెళ్ళగలిగినా జన్మ ధన్యమయి పోయినట్లేనని సంస్థాన ఉద్యోగులే భావించేవారు. కానీ, మహారాజావారా విందులకు అహ్వానించేవారి సంఖ్య పరిమితం. తనకు అత్యంత ప్రీతిపాత్రులైన అంతఃపుర స్త్రీలలో కొద్దిమందినీ, తన స్వకుటుంబీకులలోని నలుగురయిదుగురినీ, అత్యంత విశ్వాసపాత్రులైన ఇద్దరు ముగ్గురు రాజోద్యోగులనూ మాత్రమే శ్రీవారు ఆ విందులకు ఆహ్వానించేవారు.

ఆ ఈత కొలను ఒక్కసారి 150 మంది స్వేచ్ఛగా జలక్రీడలాడదగినంత విశాలమయినది. వేసవిలో నీరు చల్లగా ఉండడంకోసం పెద్ద పెద్ద మంచు ముక్కలను కొలనులో వదిలేవారు. అవలా చిన్న కొండల్లా తేలిపోతూంటే, దాదాపు వంటికి అతుక్కుపోయిన అతి పల్చని

ఈత దుస్తులు ధరించిన మహారాజావారి స్త్రీజనం ఆ మంచుకొండల మీద మధు పాత్రలతో కూర్చుని నీళ్ళలో అలా అలా తేలిపోతూ మహారాజా వారిని సేవించుకునేవారు. వారి సంఖ్య 50 నుండి 60 దాకా ఉండేది. వారంతా అలా తెల్లవారేదాకా ఖరీదయిన పానీయాలు సేవిస్తూ, రుచికర మైన ఆహారాలు అస్వాదిస్తూ పరిసరాల్ని క్రీడావనంగా, మధుభాండంగా మార్చివేసేవారు.

ఆ పరిసరాల్లో, యుద్ధవిద్యలలో ఆరితేరిన, 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు మాత్రమే కాపలాకాస్తుండేవారు. మిగిలిన పరిచారకులంతా యవ్వనంలో ఉన్న స్త్రీలే. ఎప్పుడేనా విదేశాల్నుండి మహారాజావారికి అతిధులుగా వచ్చే యూరోపియన్ యువతులకు తప్ప ఆ క్రీడాంగణం లోకి మరెవరికీ ప్రవేశంలేదు.

ఈ మహా వైభవాన్ని గురించి కర్ణాకర్ణిగా విన్న భరత్‌పూర్ మహారాజా హిజ్ హైనెస్ మహారాజా కిషన్‌సింహజీ వారు ఏంచేశా రంటే...?

తన రాజభవనాన్నానుకునే తనూ ఓ బ్రహ్మాండమయిన పాలరాతి ఈత కొలనును నిర్మింపజేసుకున్నారు. ఆ కొలనుకు చందనపు చెక్కతో చేసిన ఇరవై మెట్లున్నాయి. ఒక్కొక్క మెట్టూ ఒక్కో కళాఖండం అన దగిన రీతిలో శిల్పులు వాటిని తీర్చిదిద్దేరు.

అలాంటిమెట్ల కటుఇటూ స్వాగతం ఇస్తూన్నట్లున్న శిల్పాలను నిల బెట్టటం సంప్రదాయం. అయితే, మహారాజా కిషన్‌సింహజీవారి మేధస్సు అమోఘమైనది. వారు ఒక కొత్త ఆలోచన చేసేరు. నవయవ్వనంలో నున్న నలభై మంది సౌందర్య యువతులను శ్రీవారు ఎన్నికచేశారు. వారు ప్రతి సాయంత్రం ఈత కొలను మెట్ల కటూ ఇటూ మెట్టుకు ఇద్దరు

చొప్పున నగ్నంగా నిలబడేవారు. వారి చేతులో ప్రత్యేకంగా తయారు చేసిన క్రొవ్వొత్తులు వెలిగిపోతూండేవి.

అలాంటి సమయంలో...!

దేవేంద్రుడి బొమ్మరిదిలా వెలిగిపోతూ మహారాజావారు వేంచేశే వారు.

మెట్ల కటూఇటూ నిలబడిన యువతులను క్రీగంటచూస్తూ, ఒక్కొక్కరి శరీరాన్ని ఒక్కొక్కచోట తాకుతూ, నొక్కుతూ, గిల్లుతూ శ్రీవారు ఆఖరు మెట్టును దాటి చేత మధు పాత్రతో సహా జలక్రీడ నారంభించేవారు.

అప్పుడా నలభైమంది యువతులూ కూడా జలప్రవేశం చేసేవారు. తమచేతుల్లోని క్రొవ్వొత్తులను బొడ్డుకు కొంచెం దిగువగా, నిలబడేలా అమర్చుకొని అవి పడిపోకుండా నీటిలో వెల్లకిలా పడుకుని దాదాపు నృత్యం చేస్తున్నట్లుగా ఈత కొట్టేవారు.

ఆ సమయంలో కొలనూ, ఆ పరిసరాల్లోగల లైట్లన్నీ ఆర్పివేయబడేవి. క్రొవ్వొత్తుల వెలుగులో సదరు సుందరాంగుల ఒంటి వంపులను తిలకిస్తూ, మధుసేవచేస్తూ మహారాజావారు గోపికల మధ్య శ్రీకృష్ణ పరమాత్మలా వెలిగిపోతుండేవారు.

అలా వారు అలసిపోయేదాకా నృత్య క్రీడ జరపగా, ఆ కదలిక వలనగానీ, నీరు చిందిగానీ ఒక్కొక్క క్రొవ్వొత్తే ఆరిపోతుండేది. ఎవరి క్రొవ్వొత్తయితే చివరివరకూ ఆరిపోకుండా ఉంటుందో ఆ యువతి ఆ నాటికి హీరోయిన్. ఆవిడను మహారాజావారు ప్రత్యేక బహుమతులతో సత్కరించి సరాసరి శయనాగారంలోకి తోడ్కొని పోయేవారు.

ఫలశ్రుతి ఏమంటే : ఇటువంటి ధన్య జీవులైన మహారాజాల విషయంలో ఆ నాటి బ్రిటిష్ పాలకులు ప్రత్యేకాభిమానంతో ఉండేవారు, వారిని అనేకానేక బిరుదులతో సత్కరిస్తూండేవారు. వీరికి ఈ సుఖాల్లో పడి సంస్థాన వ్యవహారాలు చూసుకునే తీరికా, ఓపికా ఉండేవిగావు. కనుక బ్రిటిష్ వారిదే పాలనా వ్యవహారాల్లో ఇష్టారాజ్యం.

కానీ...కానీ...!

సదరు యువతులు మాత్రం కాస్తవాడి, వడిలిపోగానే అంతఃపురం నుండి బయటికి విసరివేయబడేవారు.

★